# కళాసాగరం

"ఇదే కళాసాగరం" అన్నాడు నా గైడ్.

సాగరం అతిశయోక్తిలాగా కనబడింది. సరస్సు అనవచ్చు. అవతలి ఒడ్డు కనిపిస్తున్నది.

"మేం దీన్నే మహాసముద్రంగా భావిస్తున్నాం. కళా చెరువులూ, కళాబావులూ, కళా గుంటలూ, అందులో కూర్చుని బెకబెకలాడే కళా కప్పలూ చూసిన వారికే ఇది మహాసాగరం కాదుటండీ, గురూగారూ?" అన్నాడు నా గైడ్.

"కనీసం లోతైనా అట్టే ఉన్నట్టు కనిపించదే?" అన్నాను.

"ఎంతమాటన్నారండీ! ఇందులో చాలామంది మునిగిపోయారండీ!" అన్నాడు గైడ్.

"మరీ పొట్టి సజ్జెమో?"

"అది ఉందనుకోండి! ఈత రాకపోవటం ఉందనుకోండి! – చిల్లి పడవల్లో పోవటమూ ఉందనుకోనిడి? పడవలవాళ్లు ముంచెయ్యటమూ ఉందనుకోండి."

"అదోటా?"

"అవును, గురుగారూ! అవతలోడ్డు చేరితే మంచి గిట్టుబాడు గదండీ? పడవ మాట్లాడుకున్న వాడి దగ్గర ప్రయాణం పూర్తిచేసే తైలం లేదని తెలిస్తే, వాడి తైలం అయిపోగానే పడవని తిరిగి సొంతం చేసుకుని, వాణ్ని నడిసముద్రంలో ముంచేసి, అవతలి ఒడ్డు చేరి ప్రైజు కొట్టేస్తారు. వ్యాపార ధర్మం అంతేగదండీ?"

"వ్యాపార ధర్మం ఏమిటి? ప్రైజు ఏమిటి? రెంటికీ పొంతన కుదురుతుందా?" అన్నాను.

"కుదిరేట్టు చూసేటందుకు ప్రజలున్నారు లెండి."

నాకు అవతలి ఒడ్డుకు పోవాలనిపించింది. అసలు సారస్యం అక్కడే ఉన్నట్టు నాకు తోచింది.

"పడవ కొనే తాహతుందా? మధ్యలో పడవ మునిగితే ఈదగలరా?" అన్నాడు నా గైడ్.

"ఎందుకయ్యా? చుట్టూ తిరిగి పోదాం. ఎంతో సేపు పట్టదు" అన్నాను.

నేను అనుకున్నది నిజం. అసలు హడావుడంతా అవతలి ఒడ్డునే ఉన్నది.

జనం – హర్షధ్వానాలు – వెటకారాలు – వెక్కిరింతలు – మీటింగులు – కొట్లాటలు!

జనం మధ్యగా తిరుగుతూ, చెవుల్లో కలాలూ, అరచేతిలో కాగితాలూ పట్టుకుని తిరుగుతున్న వాళ్లు కనిపించారు.

"వాళ్లెవరు?" అని అడిగాను.

"జర్నలిస్టులు, ఒక్కో పడవ ఒడ్డున చేరినప్పుడల్లా వాళ్లు బాకాలూదుతారు. అవతలి పక్కనుంచి ఏ పడవ ఎప్పుడు బయలుదేరిందీ, అది ఎంతదూరం వచ్చినదీ, ఉజ్జాయింపుగా ఎప్పుడు ఒడ్డు చేరేది, లౌడ్‌స్పీకర్‌లో చెబుతుంటారు. మధ్య ఏ పడవైనా ఆగిపోయినా, మునిగిపోయినా దాని ఊసెత్తరు. ఒడ్డు చేరిన వాళ్లకూ సన్మానాలు అవీ ఏర్పాటయినా, కళాసాగర్ తరుణంలో కృతకృత్యులైనవాళ్లు వెలిబుచ్చే అమూల్యమైన అభిప్రాయాలు అశేషజనానీకానికి తెలిసి, వాళ్లు ధన్యులు కావలన్నా, జర్నలిస్టుల సహకారం విధిగా ఉండితీరాలి."

"అబ్బా! చాలా శ్రమపడతారన్నమాట?" అన్నాను.

"జర్నలిస్టు జాతికి వీళ్లు రాజులు కారటండీ? తెలివైన జర్నలిస్టు తెలివి తక్కువ కళా వ్యాపారి కన్న ఎక్కువ సంపాదిస్తాడు. రెక్కల పురుగుల్లాగా వీళ్లు కళాచీకట్లకు దూరంగానూ, కళా ద్వీపాలకు వీలయినంత దగ్గిరగానూ ఉంటారు."

"వీళ్ల కింత ప్రాముఖ్యం ఎట్లా వచ్చి ఉంటుంది?" అని అడిగాను.

"ఒకప్పుడు ఈ కళాసాగరం బుల్లి చెరువంత ఉండేది. ఆ మాట నిజం కూడా లెండి. దీన్ని మహాసముద్రంగా చేసింది మేమేనంటున్నారు జర్నలిస్టులు. కాదని ఎవరూ అనలేదు."

కళాసాహం మీదికి దృష్టి సారించాను. వచ్చే పడవల్లో చాలామంది ఉన్నట్టు కనబడింది. వాళ్లంతా ఎవరు?

"వాళ్లు నక్షత్రాలు. పడవలు మునిగినా వాళ్లు మునగరు" అన్నాడు నా గైడ్.

"బాగా ఈదుతారు కాబోలు."

"అదీ నున్నూ, వాళ్లసలు నీటిలో మునగరు. చాలా తేలిక!"

"అలా చెప్పు! ఎంత అదృష్టవంతులు. మాట్లాడుకునేవాళ్లు అంత తేలికగా ఉంటే ఎంత బాగుణ్ను?" అన్నాను.

"అదేవిటి, గురూగారూ? అలాటి వాళ్లు చాలామంది ఉన్నారు. పది పడవలు వరసగా మునిగినా పదకొండో పడవను సంపాదించగల వాళ్లున్నారు! వాళ్ల పరపతి

అలాటిది! నిజాని కళాసాగరాన్ని ఈదటం ఒక గొప్ప కళ. విద్య! అది తెలిసినవాళ్లు కళలో మునిగి తేలగలరు. చాలా తేలిక!"

"ఆరె, ఇక్కడెవరో కొట్లాడుకుంటున్నారు, దేనికో?" అన్నాను.

"దూరంగా భూజాలమీద చేతులు వేసుకుని పోతున్న నక్షత్రాలను చూశారా? వాళ్ల అభిమాన సంఘాల వాళ్లు. ఎవరి నక్షత్రం వాళ్లకెక్కువ. ఏమంటారు?"

"నక్షత్రాలు సఖ్యంగానే ఉన్నారే?" అన్నాను.

"అంత అమాయకంగా మాట్లాడతారేవిటి, గురూగారూ? ఇద్దరు రాజులు యుద్ధం చేస్తారు. అటూ ఇటూ జనం చస్తారు. రాజులిద్దరు సంధి అని చెప్పి షేక్‌హాండ్ చేసుకుంటారు. ఓ జాతకంలో రెండు గ్రహాలకు షష్టాష్టకం అవుతుంది. వాడు పురుగు తాకి పోతాడు. గ్రహాల కేం? అవి బాగానే ఉంటాయి. ఏమంటారు?" అన్నాడు నా గైడ్.

"నన్ను ఇంతదూరం తెచ్చావుగాని, నాకివేమంత నచ్చలేదు, తమ్ముడూ" అన్నాను.

"ఇంతకన్న బాగున్నదేదో ఒకటి చెప్పండి."

"మా ఊరి కళాచెరువు ఎంత అందంగా, ఉంటుందనుకున్నావు? ప్రశాంతంగా, చల్లగాలి వీస్తూ పక్షులు పైగా ఎగురుతూ – దాని పక్కన ఎంతసేపు కూర్చున్నా ప్రాణం లేచివచ్చినట్టుంటుంది గాని, ఇలా బుర్ర ఖరాబై పోదు."

"మీరలా అన్నారు గనక నన్నో మాట చెప్పనిస్తారా? మీ కళాచెరువు కప్పలు ఈ కళాసాగరంలో ఘనంగా బతకాలని ఎన్ని వస్తున్నాయో మీకు తెలుకా?"

"నాకు తెలీదు" అని ఒప్పుకున్నాను.

"చూస్తూండండి. అన్ని కళాగుంటలూ, కళాబావులూ, కళా చెరువులూ పాడుబడి పోతాయి. ఈ కళాసాగరం మహాసముద్రమై, ఒక ఒడ్డునుంచి ఇంకో ఒడ్డు కనబడకుండా పోయే రోజువస్తుంది – సంస్కృతి అంటే దీని ఒడ్డున చూడాలన్న రోజు ఎంతో దూరంలోలేదు" అన్నాడు గైడ్.

ఏదో అందామనుకున్నాను గాని, తీరా అనటానికి ఏమీలేదని గ్రహించాను.

***ముద్రణ : యువ,దీపావళి ప్రత్యేక సంచిక, 1976***